వచ్చే నెల 30 నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-పాడేరు: శ్రీకాకుళం,విజయనగరం,విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి వచ్చే ఏడాది మార్చి 29న పదవీ కాలం ముగుస్తుండటంతో కొత్తగా ఉపాధ్యాయ ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు వచ్చేనెల 30న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ ఏడాది డిసెంబరు 30 నాటికి తుదిఓటర్ల జాబితా రూపొందించాలని స్పష్టం చేశారు. 2025 సాధారణ ఓటర్ల జాబితా రూపకల్పనకు షెడ్యూలు విడుదల చేశారు. ప్రతి ఏటా మాదిరిగానే జనవరి 6వ తేదిన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి డాక్టర్ ఎంజె. అభిషేక్, జిల్లాలో ఓటర్ల నమోదు తాజా పరిస్థితిని వివరించారు డిఆర్ఓ బి. పద్మావతి పాల్గొన్నారు.

మత్తుకు బానిసలై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

విద్యార్థులతో మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమ్మిద స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు , మత్తు పానీయాలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువతను ప్రలోభపెట్టి, కొంతమంది వ్యాపారులు, వ్యక్తులు వారిని గంజాయి రవాణాకు ప్రోత్సహిస్తున్నారని అటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు చెడు అలవాట్లు పై బానిసలు కావద్దని, చదువుకుంటే ఉన్నతమైన భవిష్యత్తు ఉందన్నారు. హాస్టల్ వసతి భవనం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె ,ప్రమీల సమిత సమస్త ప్రతినిధి దుర్గ ప్రసాద్ లెక్చరర్ తవిటినాయుడు హాస్టల్ ఎస్‌డబ్ల్యుఒ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు

బాలింత, శిశువు మృతిపై విచారణ

చింతపల్లి ఏరియా ఆసుపత్రి సందర్శనలో ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ రమేష్

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆసుపత్రికి డెలివరీకి వచ్చిన గర్భిణి, ఆమెకు పుట్టిన నవజాత శిశువు మరణంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్ ఆసుపత్రికి వచ్చి విచారణ జరిపారు. ఈనెల 8న ఖున వంతల పరిమళ అనే గర్భిణీని ప్రసవ వేదనతో చింతపల్లి ఏరియా హాస్పిటల్ కు తీసుకురాగా, అప్పటికే ఆమెకు రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే గర్భంలోని శిశువు మృతి చెందింది. అపస్మారక స్థితికి చేరుకున్న బాలింత పరిమళను విశాఖ కెజిహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృత్యువాత పడింది. కాగా బాలింత, శిశువు మరణానికి ఆమె రక్తహీనతే కారణమని వైద్యులుఅంటున్నారు. కాగా చింతపల్లి ఆసుపత్రిలో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని బాధితులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేస్తానని ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ వెల్లడించారు.

కాగా గర్భిణి మృతిపై విచారణకు ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ వచ్చారన్న సమాచారంలో స్థానిక కూటమి నేతలు ఆసుపత్రికి చేరుకుని, ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం, వైద్యసేవలు మృగ్యమౌతున్న తీరుపై జాయింట్ కమిషనర్‌కు విన్నవించారు.దీనిపై కమిషనర్ స్పందిస్తూ చింతపల్లి ఆసుపత్రిలో రౌండ్‌ద క్లాక్ వైద్యులు, సిబ్బంది అందుబాటులోఉండేలా చర్యలు చేపడతామన్నారు. వైద్యసేవలు మెరుగుపరుస్తామన్నారు. కాగా ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ విచారణకు వస్తున్నారన్న సమాచారం ముందుగానే తెలియడంతో, ఎప్పుడూ లేనంతా చింతపల్లి ఆసుపత్రిలో వైద్యులు హడావిడి చేస్తున్నారని స్థానికులు అంటున్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు విస్తృత ప్రచారం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెసి అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు అధికారయంత్రాంగం విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ సూచించారు. ఈనెల 12 నుంచి 8 వారాల పాటు డిఎంహెచ్‌ఒ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సారథ్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో వారం ఒక్కో నినాదంతో, ప్రచారం కొనసాగుతుందన్నారు. మంగళవారం జేసి చాంబర్‌లో ఎయిడ్స్ నియంత్రణ విభాగం రూపొందించిన 'మీ కోసం' పోస్టరును, మీకు తెలుసా..? లోగోను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై ఎన్జీవోల సహకారంతో సెక్స్ వర్కర్లకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైవర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, జిల్లాలోని హాట్ స్పాట్స్ గుర్తించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.జమాల్ భాష, ఎపీఎస్ఎసిఎస్ సిబ్బంది, సిపిఎం కె.రామచందర్, డిఎండిఒ ఎస్.చిరంజీవి, ఎస్‌విడిఎస్ ఎన్జీవోస్ ప్రతినిధులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపిటిసి ఆనందరావుకు పరామర్శ

ఆర్థికసాయం అందిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- పెదబయలు : అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న సీకరి ఎంపిటిసి వంతల ఆనందరావును పెదబయలు మండల వైసిపి అధ్యక్షులు, మాజీ ఎంపిపి జర్సింగి బాలం నాయుడు తదితరులు పరామర్శించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ గుమ్మ తనూజారాణి ఆదేశాల మేరకు పెదబయలు మండల వైసిపి నేత జర్సింగి బాలం నాయుడు, సీనియర్ నాయకులు గంపరాయి.సూరయ్య, వైసిపి యూత్ రాష్ట్ర కార్యదర్శి చెట్టి.వినయ్, మాజీ జెడ్‌పిటిసి జర్సింగి.గంగభవాని, వైసిపి మండల ప్రధానకార్యదర్శి కొర్రా కనకరాజు, మాజీ సర్పంచ్ సాగిన నాగరాజు, మాజీ మండలఅధ్యక్షులు సందడి.కొండబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రాసగుల్లే .ధనలక్ష్మి ఇతర నేతలు పరామర్శించారు. అరకు ఎమ్మెల్యే ఆదేశాలతో రూ.పదివేల ఆర్థికసాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అక్రమ నిర్మాణాలన్నీ తొలగించాల్సిందే

- దర్యాప్తునకు వచ్చిన ఐటిడిఎ పిఒ, ఎస్‌డిసిలకు ఆదివాసీ గిరిజన సంఘం వినతి

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట: గిరిజన చట్టాలు, 1/70 నిబంధనలను అతిక్రమిస్తూ చేపట్టిన అక్రమనిర్మాణాలన్నింటినీ తొలగించాల్సిందేనని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఎట్టకేలకు అక్రమ నిర్మాణాలపై దర్యాప్తుకు వచ్చిన ఐటిడిఎ పిఒ వి అభిషేక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ రావడంతో వారికి మరోమారు వినతిపత్రం అందజేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సంఘ మండల కార్యదర్శి టి.కృష్ణారావు మాట్లాడుతూ, మండల రెవెన్యూ కార్యాలయానికి సమీపాన వెలుగు కార్యాలయ స్థలాన్ని ఆక్రమించుకొని బుడ్డిగ కొండమ్మ నిర్మిస్తున్న నిర్మాణం పై అధికారులు ఎందుకు పట్టించుకోలేదని వారు ప్రశ్నించారు. ప్రెస్‌క్లబ్ సమీపాన అక్రమ నిర్మాణాలను, దొడ్డి ప్రసాదు అనే గిరిజనే తరుడు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారన్నారు. షేక్ ఆలీ,షేక్ ఖాదర్, అదిన సంతోష్, బుడ్డిగ రమేష్, సాకెల శివ, షేక్ వహీద్, సోమలింగం ఇలా అనేకమంది గిరిజనేతరులు బినామీల పేర్లతో, బోగస్ గ్రామసభల తీర్మానాలతో వారు చేపట్టిన అన్ని అక్రమ నిర్మాణాలపై దరాప్తు చేయాలని కోరారు కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి డిటి. కృష్ణారావు, అర్ఐ, విఆర్ఒ కొండబాబు సిబ్బంది, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రామారావు, నరసింహమూర్తి ఉన్నారు.

ఐటిడిఎ పిఒ సుడిగాలి పర్యటన

విధులకు డుమ్మా కొట్టిన జాముగుడ హెచ్‌ఎం, మేట్రిన్‌తోపాటు ఉపాధ్యాయులకు షోకాజ్

ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా డుంబ్రిగుడ పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గర్భిణులతో మాట్లాడుతూ పోషకాహార కల్పనపై ఆరా తీశారు. గర్భిణులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పక్కగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. నెలలు నిండి అసుపత్రికి రాని వారి సమాచారం అందిస్తే, రెవెన్యూశాఖ సహకారంతో వారిని ఆసుపత్రిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయుర్వేద వైద్యశాలలో సందర్శించి, మందులను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను పరిశీలించి వైద్య అవసరాలకు వినియోగించాలని సూచించారు. ఈనెలాఖరులోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి చుట్టూ ఉన్న తుప్పలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని మండలపరిషత్ సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో బాలింతలకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్ష గదిని పరిశీలించిన మూడు నెలలుగా వచ్చిన మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణికి హిమోగ్లోబిన్ పరీక్షను దగ్గర ఉండి చేయించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులతో నైట్ వాచ్‌మ్యాన్‌ను నియమించేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారిణి అంబికను ఆదేశించారు. . అనంతరం అరమ పంచాయతీ జాకరవలస మీదుగా నిర్మిస్తున్న పివిటిజి గ్రామం గోలంబో రోడ్డును పరిశీలించారు.

జాముగుడ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్ , ఉపాధ్యాయులకు షోకాజ్

జామిగూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ సమయంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, డిప్యూటీ వార్డెన్ కె.లక్ష్మి ఇతర ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహించిన పిఒ, వారికి వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ కొండలరావును. ఆదేశించారు. రెండు రోజుల్లో వారి నుంచి వివరణ రాబట్టాలని సూచించారు. పాఠశాల పట్ల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పనితీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం సొవ్వ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమం పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రాన్ని బోధించారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిడి కొండలరావు, గిరిజన సంక్షేమ జెఇఇ అభిషేక్, అధికారులు పాల్గొన్నారు.

వరద ముంపు నష్టంపై సర్వే చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-చింతూరు

విలీన నాలుగు మండలాల్లో వచ్చిన వరదలకు మునిగిన కుటుంబాలను తక్షణమే సర్వే చేసి నష్టాన్ని అంచనా వేసి నమోదు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. చింతూరులో మంగళవారం జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులు ప్రతి సంవత్సరం వరదలకు గురవుతూ నష్టపోతున్నారన్నారు. వదరలకు పునరావాస కేంద్రాలకు వెళ్లడం, తరువాత ఇళ్లను శుభ్రం చేసుకోవడానికి ఎంతో ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. అంతే కాకుండా రెండు వారాలకు పైగా వరదలో ఉండడంతో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులకు ప్రభుత్వం ఇచ్చే రూ.3వేలు ఏ మూలకు సరిపోవడం లేదన్నారు. అందువల్ల ముంపునకు గురైన ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని, దానికోసం సర్వే చేసి అంచనా నమోదు చేసి నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

తునికాకు సేకరణ పేమెంట్స్ తక్షణమే చెల్లించాలి

తునికాకు సేకరణ చేసిన కార్మికులకి పేమెంట్స్ చెల్లించే విషయంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంతెన సీతారాం విమర్శించారు. కార్మికులకు ఇంతవరకు పేమెంట్స్ పూర్తిస్థాయిలో చెల్లించకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ సీజన్లో వ్యవసాయానికి అయ్యే ఖర్చులకి వస్తాయని కార్మికులు తునికాకు సేకరణ చేసినప్పటికీ పేమెంట్స్ చెల్లించకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పేమెంట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, సీసం సురేష్, మేకల నాగేశ్వరరావు, ఐవి, సోయం చినబాబు, సంతోష్ పాల్గొన్నారు.

మొదటి మంగళవారమే ఆశాల సమావేశం నిర్వహించాలి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ

ప్రజాశక్తి-చింతూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి మంగళవారం మాత్రమే ఆశా డే మీటింగ్ జరిపించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. మండలంలోని తులసిపాక పిహెచ్‌సిలో ఈ నెల 13న రెండో మంగళవారం ఆశా డే నిర్వహించడాన్ని ఆశాలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను కాదని కొన్ని పిహెచ్‌సిల్లో వైద్యాధికారులు ఇష్టా రాజ్యాంగా వ్యవహరిస్తూ ఆశా వర్కర్లును ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. తులసిపాక పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్, ఇతర సిబ్బంది తమ వైఖరి మార్చుకోవాలని హితవుపలికారు. ఏజెన్సీ ప్రాంత భౌగోళిక పరిస్థితుల్లో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఎనలేని సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా వైద్యాధికారులు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దీనిపై చూస్తూ ఊరుకొనేది లేదన్నారు. చింతూరు ఎడిఎంహెచ్‌ఒ వెంటనే స్పందించి విలీన మండలాల్లోని అన్ని పిహెచ్‌సిల్లో ప్రతి నెల మొదటి మంగళవారం మాత్రమే ఆశా డే జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే అన్ని పిహెచ్‌సిల ఆశా వర్కర్లు విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తులసిపాక పిహెచ్‌సి పరిధిలోని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

80 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా, రెండు వేర్వేరు కేసుల్లో 80 కేజీల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనలో భాగంగా మోతుగూడెం పోలీసులు చెక్ పోస్టు వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన పెమ్మల ప్రశాంత్, మదిగొండ్ల మణి సందీప్ ఇద్దరూ కొందుగూడ గ్రామం నుంచి స్కూటీపై 20 కేజీల గంజాయిని తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులకు చిక్కారు. వారిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నెమల్లపాలెం నుండి భద్రాచలంకు 60 కేజీల గంజాయిని నెమల్లపాలెం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అందులో ఇద్దరు వ్యక్తులు ఒక బైక్‌పై అక్కడి నుండి తప్పించుకొని పారిపోయారు. ఈ కేసులో వరుడు బంగారయ్యతో పాటు మరొక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా చింతూరు సిఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ చింతూరు సర్కిల్ పరిధిలో వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ పోలీసుల సహకారంతో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. తప్పించుకుని పారిపోయిన వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఆరు నెలల క్రితం పారారైన నిందితులను పట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం ఎస్ఐ గోపాల్‌రావు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేత విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి 4 అవార్డులు సొంతం చేసుకున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పలువురు విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. వారిలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.హారిక, ఈ.అనిప్రియ జ్యూరీ అవార్డులు, ప్రశంసా పత్రాలు, టి.కామేశ్వరి, టి.సిరివల్లి మెరిట్ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చిన నలుగురు విద్యార్థులను, వారికి చిత్రలేఖనంలో మంచి తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఎం.కొండబాబును ఎంఈఓ-1 కెవీ సత్యనారాయణదొర, ఎంఈఓ-2 సూరారెడ్డి, హెచ్‌ఎం గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.బొజ్జయ్య, సిహెచ్ శివకృష్ణ, చప్పా సత్యనారాయణమూర్తి, ఎం.ఉదయ్, విఘ్నేశ్వరరావు, వెంకటరమణ, పాల్‌బాబు నానాజీ, ప్రసాదరెడ్డి, ఏసు కుమారి, రేష్మ, శాంతి ప్రియ, గంగాభవాని, అప్పారావు, రాజమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవికి సమస్యలను తెలియజేస్తున్న ప్రజలు

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంగళవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి ఆమె క్యాంపు కార్యాలయంలో పలువురు వినతి పత్రాలు అందించారు. దేవీపట్నం మండలం పూడిపల్లి కొత్త కాలనీ వద్ద గ్రామానికి కరెంట్, రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు కోరారు. నూతన పింఛన్లు మంజూరు పలువురు అర్జీలు ఇచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ప్రతి వారి విజ్ఞప్తిని పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయ్‌భాస్కర్, టిడిపి దేవీపట్నం మండల అధ్యక్షులు మర్రిచెట్ల వెంకటేశ్వరరావు, పూడిపల్లి గ్రామస్తులు బదిరెడ్డి మోహన్‌రావు, అబ్బులు, మాజీ సర్పంచ్ కుంజం శివ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక ఎస్ఐ టి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రం రేఖపల్లిలో ఆటో కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలని ఆదిలోనే అంతం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రవాణా జరుగుతున్న నేపథ్యంలో మీమీ వాహనాల్లో ఎవరైనా అటువంటి అనుమానితులు తారస పడితే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత క్రీడలపై ఆసక్తి చూపించాలని, చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్ పురం హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికులతో మాట్లాడుతున్న పోలీసులు

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ దాసుబాబు

చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : అరకులోయ టౌన్‌షిప్ పరిధిలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పారిశుధ్య పనులు స్థానిక సర్పంచ్ పెట్టెలి దాసుబాబు దగ్గరుండి చేయిస్తున్నారు. అరకులోయ టౌన్ షిప్ పరిధిలోని పారిశుధ్య కార్మికులతో ప్రతి డ్రైనేజీని కాలువలను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా .అరకులోయ మెయిన్ రోడ్ లో డివైడర్ పై పెరిగిన పిచ్చి మొక్కలను, గడ్డిని పూర్తిస్థాయిలో తొలగించారు. రోడ్లకు ఇరువైపులా చెత్త లేకుండా తొలగించి పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కలెక్టర్ సూచనల మేరకు టౌన్‌షిప్ పరిధిలో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. .అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత అరకులోయ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సర్పంచ్ దాసు బాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాలక రాజకుమార్, సచివాలయం సిబ్బంది ప్రసాద్, భగవాన్, వార్డు సభ్యులు కిముడు త్రినాథ్ పాల్గొన్నారు.

128 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

అనంతగిరి ఆసుపత్రి వద్ద కేన్సర్ పరీక్షకు ఓపి నమోదు చేస్తున్న వైద్యబృందం

ప్రజాశక్తి -అనంతగిరి : స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ, హైదరాబాద్ కు చెందిన వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రాస్ కేన్సర్ ఫౌండేషన్ సంస్థకు చెందిన 20మంది స్పెషలిస్ట్ వైద్యనిపుణులు బృందం డాక్టర్, మణికంఠ డాక్టర్ గౌతం ఆధ్వర్యంలో కేన్సర్ నిర్ధారణ ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. 128మంది మహిళలకు నిర్వహించిన వైద్యపరీక్షల్లో 22 మందికి ఐసిఐ, స్కానింగ్, 38 మంది మహిళలకు పప్స్ మేర్, మరో 28 మంది మహిళలకు మెమోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. మిగతా రోగులకు సాధారణమైన పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కేన్సర్‌పై అవగాహన కల్పించి, తగు సూచనలు చేశారు. బుధవారం కాశీపట్నం గ్రామపంచాయతీ సచివాలయ కేంద్రంలో ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహిస్తామని, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిణి జాహ్నవి, ఎంపిఎస్ఇఒ .నర్సింగరావు, పిహెచ్ఎన్ విమలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని జిబిఐ ప్రపంచ సహకార చొరవ ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ టీఎల్ సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లాలో కుష్టు బాధితులకు నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేపట్టారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాడేరుకు చెందిన ఎలీసా రావు బొంతు హుకుంపేట,పాడేరు, జిమాడుగుల, చింతపల్లి నాలుగు మండలాల్లో గుర్తించిన 60 మందికి, ఏడు రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాడేరు ఫెలోషిప్ అధ్యక్షులు ఎస్ సాల్మన్‌రాజు, సంస్థ కోఆర్డినేటర్ ప్రసాదరావు, టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలకు లోబడి స్వాతంత్ర్య దినోత్సవం

జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు: ఈ నెల 15న 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎన్నికల కోడ్ దృష్టిలో పెట్టుకుని తగు రీతిలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ, ఉదయం ఏడున్నర గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ జండాను ఎగురవేస్తారని, 9 గంటలకు తలారిసింగి పాఠశాల పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ జాతీయ జండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారన్నారు. పెరేడ్ అనంతరం పాడేరు వీధులలో శకటాల ప్రదర్శన ఉంటుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీసారు. బుధవారానికి గ్రౌండ్, వేదిక, సీటింగ్, మైక్ సిస్టం ఇతర ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. మాస్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు రిహార్సల్స్ పూర్తి చేసి ప్రదర్శనకు సిద్ధం కావాలని ఆదేశించారు. మైదానంలో స్టాల్స్‌సిద్ధం చేయాలన్నారు. పోలీస్ కవాతు, ఇతర ప్రదర్శనలు రిహార్సల్స్ పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్, చింతూరు ఆర్‌డిఒ వి. చైతన్య, కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ బి. పద్మావతి, డిపిఆర్‌ఓ గోవిందరాజులు, ఎస్‌డిసి వివిఎస్ శర్మ, జిల్లా నుండి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయంలో వితంతు పింఛన్ల దరఖాస్తులు

ఐటిడిఎ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు: వితంతు పింఛన్లకు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేసారు. మంగళవారం స్థానిక జిల్లా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్, డిఆర్‌డిఎ వితంతు పింఛన్లపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ గ్రామ సచివాలయ కార్యాలయంలో సామాజిక పింఛన్ల కోసం డిజిటల్ అసిస్టెంటును సంప్రదించాలని సూచించారు. సచివాలయంలో సిబ్బందిని సంప్రదిస్తే ఎలా దరఖాస్తు చేయాలో తెలుపుతారన్నారు. సచివాలయంలో పరిష్కారం కాకపోతే ఐటిడిఎకు లేదా మండల పరిషత్ కార్యాలయాలకు రావాలని సూచించారు. రైతు కార్డులో మృతి చెందిన భర్త పేరు ఉంటే వితంతు పింఛను మంజూరు చేయరని, ముందుగా కార్డులోని భర్త పేరు తొలగించాలన్నారు. మండల కేంద్రంలో వారపుసంత రోజున పింఛన్ల కోసం ఒక రోజు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 10 ఎకరాలు మెట్టభూమి, 3 ఎకరాల పల్లపు భూమి ఉంటే పింఛన్లకు అనర్హులు కారని గుర్తించాలన్నారు. అనంతరం తెలుగు ఆధ్వర్యం నిర్వహిస్తున్న విస్తర తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లు, కప్పులను స్థానిక హోటల్స్ కు సరఫరా చేయాలని సూచించారు. హోటల్స్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని గట్టి నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, ఎంపిడిఒ సాయి నవీన్, ఇఒపిఆర్‌డి రమేష్, ఎపిఎం వివేక్ ప్రసాద్, న్యాయవాదులు పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పిఒ చొరవతో విద్యార్థికి మెరుగైన వైద్యం

విద్యార్థిని అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు తరలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ చొరవ, ప్రత్యేక ఆదేశాలతో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి మెరుగైన వైద్యసేవలకు విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. వివరాలివి. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాల-2 లో విద్యానభ్యసిస్తున్న డడియ విఘ్నేష్ అనే విద్యార్థికి ఈనెల 3న తీవ్రమైన కడుపునొప్పితో అనారోగ్యం చేయగా, పాఠశాల డిప్యూటీ వార్డెన్ మండల కేంద్రంలోని సిహెచ్‌సికి తరలించి వైద్యసేవలు అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యాధికారులు రక్తపరీక్షలు, ఎక్సరే, స్కానింగ్ చేసి, వ్యాధి నిర్ధారణకు ఎండోస్కోపీ చేయాలని, పాడేరులో అందుబాటులో లేకపోవడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించాలని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియపరచగా, వారు నిరాకరించి నాటువైద్యం చేయించేందుకు విద్యార్థిని తమ గ్రామానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఐటిడిఎ పిఒ అభిషేక్, మండల తహశీల్దార్, ఎంపిడిఒలను అప్రమత్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని వైద్యం కోసం కెజిహెచ్‌కు పంపించే చర్యలు చేపట్టాలని ఆదేశించగా, మండల తహసిల్దార్ నాగరాజు ప్రత్యేక చొరవ తీసుకొని స్వర్ణలతకు ఫోన్లో సంప్రదించి సచివాలయ సిబ్బంది సాయంతో విఘ్నేష్‌ను ముంచంగిపుట్టు సిహెచ్‌సికి రప్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో పాఠశాల హెచ్ఎం సత్యారావు, డిప్యూటీ వార్డెన్ రాంబాబు ఆధ్వర్యంలో సిహెచ్‌సి నుంచి పాడేరు జిల్లా వైద్యశాలకు, అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించే ఏర్పాట్లు చేశారు. విద్యార్థికి ప్రధానోపాధ్యాయులు, తహసిల్దార్ కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి శంకరరావు

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : 2023 డిసెంబర్‌లో అంగన్వాడీల 42 రోజులు నిరవధిక సమ్మెలో విపక్షనేతగా ఉన్న చంద్రబాబు అప్పట్లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కె శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా అప్పట్లో అంగన్వాడీలకు ఇచ్చిన సమానపనికి సమాన వేతనం, గ్రాట్యూటీ అమలు, ఇతర హామీలను అమలు చేయడం లేదన్నారు. దీనిపై నిర్లక్ష్యం చేస్తే అంగన్వాడీలు మరోమారు ధర్నాలు, రాస్తారొకోలు, ముట్టడిలు, ఇతర ఆందోళనలతోపాటు అవసరమైతే నిరవధిక సమ్మెకు వెనకాడబోరని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం లక్ష్మీపురం సర్పంచ్, కె త్రినాథ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.సత్యవతి, ఎస్.మౌలమ్మ, ఎస్.ఈశ్వరి, సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

హెల్త్ వాలంటీర్లను నియమించాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గిరిజన ఆశ్రమ పాఠశాలుఋఒ, కళాశాల పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో హెల్త్ వాలంటీర్లను నియమించాలనీ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె కార్తీక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, కెజిబివి పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీబివిలో గణిత శాస్త్రం ఉపాధ్యాయులు లేని పరిస్థితుల్లో వెంటనే నియమించాలని కోరారు. పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని కోరారు.గతంలో హెల్త్ వాలంటీర్లు పాఠశాలలో ఉండటం వల్ల పిల్లల ఆరోగ్య పరిస్థితులు ప్రత్యేకంగా చూసుకునే వారని, ఇపుడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు దేవుళ్ళు, ఇమ్మానుయేల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

సీమంతాలు చేస్తున్న సిడిపిఒ, అంగన్వాడీలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయితీ, పాలెం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సిడిపిఒ సిహెచ్ బాలమణిదేవి మాట్లాడుతూ, పౌష్టికాహారంతోనే బాలింతలు,గర్భిణులతోపాటు బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు తస్తీలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలుపాటించాలన్నారు. తల్లి క్షేమంగా ఉంటేనే బిడ్డ క్షేమం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు. సచివాలయం సిబ్బంది. పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: సీజనల్ వ్యాధులపై మండలంలోని తాడేపుట్టు, కోట్నాపల్లి, రంగశీల గ్రామ సచివాలయాల్లో ఆశ వర్కర్లకు మంగళవారం పెద్దగరువులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిహెచ్ఇఒ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో హెచ్‌వి కొండమ్మ పాల్గొని ఆశ వర్కర్లకు ప్రథమచికిత్సపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్‌లో ప్రబలే మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటివ్యాధులపై అప్రమత్తంగా ఉండి, నిర్లక్ష్యం చేయకుండా వ్యాధిపీడితులకు ఆసుపత్రులకు పంపించి వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో రోగాలపై ప్రజలకు అవగాహన, సరైన వైద్యం అందించడంలో ఆశావర్కర్లతో ప్రధాన పాత్ర అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమేలి లక్ష్మయ్య, సూపర్వైజర్ సాంబశివరావు. హెల్త్ అసిస్టెంట్లు భాస్కరరావు, ముమ్మటి శ్రీనివాస్‌బాబు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డిడి కొండలరావు

పకడ్బందీగా బేస్‌లైన్ పరీక్ష

ప్రజాశక్తి -పాడేరు : విద్యార్థుల బేస్‌లైన్ పరీక్ష పేపర్లు తయారు చేయాలని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు సూచించారు. మంగళవారం ఉదయం తన కార్యాలయంలో ఎటిడబ్ల్యూఒలు, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులతో బేస్‌లైన్ పేపరు తయారీపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మూడవ తరగతి నుండి 10 వతిరగతి వరకు బేస్‌లైన్ పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో దీనికి సంబంధించి ప్రశ్నాపత్రాల తయారీ, మూల్యాంకన పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిఇఒ పి.బ్రహ్మాజీరావు, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజని, పలువురు ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి: దేశభక్తి, జాతీయవాద భావజాలంతో కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు ఇంటింటా జాతీయజెండా ఎగరేయాలని చింతపల్లి సాయినగర్ వీధికి చెందిన యువ జీవన సేవా సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహించారు.

సేవా సంఘం అధ్యక్షుడు కదుల్ల మధుసూదనరావు అధ్యక్షతన సంఘ సభ్యులంతా సాయి నగర్ వీధిలో దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ, ప్రతి ఇంటా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరిలో జాతీయతాభావం, దేశభక్తిని, జాతీయ ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో తాము స్వచ్ఛందంగా హర్ ఘర్ తిరంగా యాత్ర ను నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎల్ శివ, సెక్రటరీ డి చిన్నబాబు, సంఘ సభ్యులు, సాయి నగర్ వీధి పెద్దలు, యువత పాల్గొన్నారు.

తహశీల్దార్ తిరుమలరావుకు అభినందనలు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం తహశీల్దారుగా నియమింపబడిన సిహెచ్.తిరుమలరావుకు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో మంప స్మారకమందిరంలో 18 అడుగుల అల్లూరి విగ్రహం ఏర్పాటు, కాకరపాడు సెంటర్లో అల్లూరి విగ్రహం పున:ప్రారంభం, మల్లుదొర విగ్రహం ఏర్పాటు తహశీల్దార్ తిరుమలరావు చొరవతోనే జరిగాయని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఆయన బదిలీపై వెళ్లడం ఎంతో బాధించిందని, ఆయన మళ్లీ కొయ్యూరు మండలం తహశీల్దార్‌గా రావడం పట్ల పడాల వీరభద్రరావు హర్షం వ్యక్తం చేశారు.

ఫలించిన వైసిపి వ్యూహం

- బొత్స ఎన్నిక లాంఛనమే..! - స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో టిడిపికి ఓటమి భయం
- అందుకే చివరి నిమిషంలో పోటీకి దూరం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసిపి వ్యూహం ఫలించింది. తమ సంఖ్యా బలం పెంచుకోలేమని తెలిసి టిడిపి కూటమి పోటీ నుంచి తప్పుకుంది. స్థానిక సంస్థల వైసిపి ప్రజా ప్రతినిధులకు డబ్బులిచ్చి తమ వైపు తిప్పుకోవడానికి సోమవారం వరకు టిడిపి తీవ్ర ప్రయత్నం చేసింది. 841 మంది ప్రజా ప్రతినిధుల ఓటర్లలో 600 వైసిపికి వున్నాయి. మిగిలినవి కూటమికి వున్నాయి. కూటమి ఓట్లను పెంచుకొనేందుకు బేరసారాలకు టిడిపి సిద్ధపడింది. అయితే, వైసిపి ప్రజాప్రతినిధులు బయటలేకపోవడంతో చేసేదిలేక టిడిపి చతికిలపడింది. తమ ప్రజా ప్రతినిధులు కూటమి నాయకత్వాన్ని చిక్కకుండా వైసిపి ముందుగానే శిబిరాలకు తరలించింది. ఆ తరలింపుతో బేరసారాలకు టిడిపికి ఆస్కారం లేకుండాపోయింది. దీంతో అభ్యర్థిని పోటీలో పెట్టినా గెలవగలిగిన సంఖ్యలేదని గుర్తించి నామినేషన్ల గడువు చివరిరోజు మంగళవారం ఎన్నికల్లో కూటమి పోటీచేయడం లేదని ప్రకటించాల్సి వచ్చింది. దీనికి ముందు అనేక చర్చోపచర్చలు, వాదోపవాదాలు కూటమిలో సాగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయాలని టిడిపి కుతూహలం ప్రదర్శించింది. వైసిపి ప్రజాప్రతినిధులు ప్రవాహంలా టిడిపిలో వచ్చిచేరుతారని ఊహించారు. అందుకని ఎమ్మెల్సీ పోటీ ఆశావహులు పెరిగారు. పదవిపై ఆసక్తి చూపిన పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జీ, పివిజి.కుమార్, బత్తుల తాతయ్యబాబు పేర్లను టిడిపి అధినేత చంద్రబాబు పరిశీలనకు పంపారు. వీరెవరూ కోట్ల రూపాయల డబ్బు ఖర్చు పెట్టడానికి ముందుకురాకపోవడంతో బైరా దిలీప్‌చక్రవర్తి పేరు తెరమీదకు తెచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీచేసే అవకాశంరాని దిలీప్ చక్రవర్తిని ఎమ్మెల్సీగా పోటీలో పెట్టాలని చంద్రబాబు భావించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టడానికి చక్రవర్తి సిద్ధపడ్డంతో ఆయన్ను బరిలో పెట్టాలని కూటమి ఏకాభిప్రాయానికి వచ్చింది. వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భారీగా టిడిపిలో చేరుతారని అతి అంచనాతో అభ్యర్థిని గెలిపించి అప్పగించే బాధ్యత తమదని కొంతమంది ఎమ్మెల్యేలు చంద్రబాబు ముందు ప్రగల్భాలు పలికారు. ఈ మాటలు నమ్మలేని చంద్రబాబు వాస్తవ బలాన్ని అంచనావేసి నివేదిక ఇవ్వాలని ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించారు. అభ్యర్థిని పోటీలో పెడితే గెలుస్తామన్న విశ్వాసాన్ని కమిటీ చెప్పలేకపోయింది. మంగళవారం టిడిపి నాయకుల అభిప్రాయాలను చంద్రబాబు తీసుకున్నారు. స్థానిక సంస్థల వైసిపి ప్రజా ప్రతినిధులు ఫోన్‌కు కూడా దొరకడంలేదని ఎమ్మెల్యేలు చెప్పినట్లు తెలిసింది. తమ సంఖ్య తక్కువ వున్నప్పుడు పోటీ చేయకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి టిడిపి నాయకత్వం వచ్చింది. పోటీ చేసి ఓటమిపాలవడం కంటే, పోటీలో లేకపోవడమే గౌరవప్రదంగా వుంటుందని భావించింది. పోటీలో కూటమి లేకపోవడంతో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఎన్నిక లాంఛనప్రాయమైంది.

స్థానిక సంస్థల బరిలో ఇద్దరే..

నామినేషన్ల ఆఖరు తేదీ 13 నాటికి వైసిపి నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా పెందుర్తి సమీపంలోని గణబాబు కాలనీలో ఉంటున్న షఫీ ఉల్లా మాత్రమే నామినేషన్ వేశారు. షఫీ ఉల్లా 2019 ఎన్నికలలో పెందుర్తి అసెంబ్లీ నియోజవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఆయన నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశముందని భోగట్టా. ఇదిలా ఉండగా బుధవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఆ సమయంలో పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాకుండా ఆమోదం పొందితే, పరిశీలన అనంతరం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అప్పుడు కూడా పోటీలో ఈ ఇద్దరు అభ్యర్థులు ఉంటే పోటీ అనివార్యమవుతుంది.

సూపర్ సిక్స్ తక్షణమే అమలు చేయాలి

మాట్లాడుతున్న ఎంపిపి గోము వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్లు పెంపు తప్ప మిగతా సంక్షేమ పథకాలు అమలు కాలేదని, తక్షణమే ఎన్నికల్లో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైసిపి ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. రాజవొమ్మంగిలో సొసైటీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగిన వైసిపి ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.1.20 కోట్లుతోనే ఇప్పుడు సిసి రోడ్లు పనులు చేస్తున్నారని తెలిపారు. చిన్నయపాలెం, సింగంపల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభించాలన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్, పైప్‌లైన్‌లు మంజూరయ్యాయని, వాటిని కూడా మొదలు పెట్టాలని కోరారు. సంక్షేమ కార్యక్రమలు అమలు చేసే సమయంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, దీనిపై అధికారులతో మాట్లాడటం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు చప్ప చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు, జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఎంపీటీసీలు చంద్రు లోవలక్ష్మి, కనిగిరి దుర్గాదేవి, ఎ.నిర్మలాదేవి, కె చిన్నాలమ్మ, కె.అచ్చయ్యమ్మ, కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, సర్పంచులు ఎ.సుబ్బలక్ష్మి, సిహెచ్ శివ, ఎం ధనలక్ష్మి, ఎం సత్యవతి, ఎస్ చంద్రుడు, కె వెంకటలక్ష్మి, బి సుబ్బలక్ష్మి, కె కాంతం, టి ఆదినారాయణ, వైసిపి నాయకులు కనిగిరి దుర్గాప్రసాద్, సిహెచ్ వెంకటరమణ, కె వీరబాబు, జుర్రా జానుబాబు పాల్గొన్నారు.

మరమ్మతులకు గురై నిలిచిన బస్సు

ప్రజాశక్తి - సీలేరు : పాడేరు డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ, తెలుగు క్యాంప్ గ్రామానికి సమీపంలో నిలిచిపోయింది. మంగళవారం ఉదయం 7 గంటలకు భద్రాచలంలో బయలుదేరిన ఈ బస్సు చింతూరు, మోతుగూడెం, డొంకరాయి మీదగా వస్తుండగా, తెలుగు క్యాంప్ గ్రామానికి వచ్చేసరికి బస్సు కింద భాగంలో శబ్దం వచ్చింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపి పరిశీలించగా బస్సు అడుగుభాగం ఉన్న క్రౌన్ జాయింట్ బోల్టులు ఊడిపోయి మరమ్మతులు గురైనట్లు గుర్తించారు. వెంటనే ఆర్టీసీ అధికారులకు సమాచారం చేరవేశారు. బస్సులో ఉన్న పదిమంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలలో వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. రహదారి పెద్ద పెద్ద గోతులతో అస్తవ్యస్తంగా ఉండడం వల్లే వాహనాలు మరమ్మతులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఘాట్ రోడ్డులో నడిపే ఆర్టీసీ బస్సులు కండిషన్ కలిగినవి కాకపోవడంతో తరచూ మరమ్మత్తులు గురై ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురి కావలసిన దుస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఘాట్ రోడ్డులో దూర ప్రాంతాలకు కండిషన్ కలిగిన బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - చింతూరు : మాదక ద్రవ్యాల నిర్మూలనపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించి, చింతూరు సెంటర్ వరకు మానవహారం చేశారు. అనంతరం ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్నమణిక్యం మాట్లాడుతూ మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు యువత బానిసలైపోతున్నారని, దీని వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో మాదక ద్రవ్య వినియోగదారుల సంఖ్య 6 కోట్లకు పైగా ఉందని, వీరిలో ఎక్కువ మంది 10 నుంచి 17 ఏళ్ల వయసు వారేనని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే ఈ రుగ్మతను నివారించగలమన్నారు. మత్తు బాధితులకు సరికొత్త జీవితాన్ని అందించడానికి తెలుగు రాష్ట్రాల్లో సుమారు 100 డీ అడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై పద్మ, కె శైలజ, సిహెచ్ నాగేశ్వరావు, కె శ్రీలక్ష్మి, కె శ్రీదేవి, సిహెచ్ రాజాబాబు, యన్ రమేష్, జి సాయికుమార్, పి అలివేలు, ఆర్ మౌనిక, మూర్తి, సంగం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై పశువుల తిష్ట

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై పశువులు తిష్ట వేయడంతో వాహనచోదకులు, విద్యుత్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు పశువులు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో జల విద్యుత్ కేంద్రానికి విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనాలపై వెళ్లే ఉద్యోగులు ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందని భయపడుతున్నారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ పశువులు రోడ్డుపైనే మలమూత్రాల విసర్జన చేస్తున్నాయి. స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచి దుర్గ స్పందించి పశువులు యజమానికి నోటీసులు జారీ చేసి, పశువులు రోడ్డుకు అడ్డంగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వృక్ష సంయుత వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఎర్రంపేట గ్రామంలోని రైతులకు వృక్ష సంయుత వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దేవరకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి నాట్లు వేసిన పది రోజుల్లోనే భాస్వరాన్ని అందించే ఎరువులు వాడాలని, కలుపు నియంత్రణలో రసాయనిక ఎరువులను వాడవద్దని హితవుపలికారు. ఎరువులు వేసిన తర్వాత కూలీలతో కలుపు తీయించాలని సూచించారు. పొటాష్ ఎరువుని తప్పనిసరిగా వాడాలన్నారు. అనంతరం మునగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ గణేష్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సారక్క, సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్స్ సురేష్, వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

జెండా పండగకు నిధులు పెంపుపై హర్షం

ప్రజాశక్తి-కొయ్యూరు : స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణకు పంచాయతీలకు నిధులు పెంపు పట్ల జనసేన మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణ్, బూత్ కన్వీనర్ సాగిన బుజ్జిబాబు హర్షం వ్యక్తం చేశారు. గతంలో చిన్న పంచాయతీలకు రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 మాత్రమే ఇవ్వగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చిన్న పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు మంజూరు చేశారని తెలిపారు. దీంతో ఎన్నడూ లేని విధంగా జెండా పండుగ నిర్వహించేందుకు పుష్కలంగా నిధులు సమకూరాయన్నారు.